క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ నాయకులు, బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, శ్మశానవాటికలు, ఉపాధిహామీ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో పార్టీ ఆమోదం పొందేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, ఎడ్మల శైలేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, ఊరడి రాజ్‌కుమార్, పర్వతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గొల్లపల్లి: ఎమ్మార్సీకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్ష ఉద్యోగులు పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖకు వినతిపత్రం అందించి మాట్లాడారు. 15 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జూపాక సుదర్శన్, మండల కార్యదర్శి ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో ఈజీఎస్ పనులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నవీన్

కోరుట్లరూరల్: మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామశివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి పనులకు నిధులు, కూలీలకు ఇచ్చే డబ్బులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని తెలిపారు. కూలీలతో ముచ్చటించి రోజు ఎంత కూలీ వస్తోందని తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు నివేశన స్థలాలు అందించాలి



వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

రాయికల్: మండలంలోని పాత్రికేయులకు నివేశన స్థలాలతో పాటు, ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం డెప్యూటీ తహసీల్దార్ అనిల్‌కు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రసూల్, సీనియర్ పాత్రికేయులు బింగి శంకరయ్య, వాసరి రవి, వాసం లింబాద్రి,జగదీశ్వర్, మచ్చ శేఖర్, ఎనుగంటి రవి, నాగిరెడ్డి రఘు, గంగధరి సురేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బడిబాట



రామయ్యపల్లెలో బడిబాట ర్యాలీ

ధర్మపురి: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామాల్లో బడిబాట కొనసాగుతోంది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని నేరెళ్ల, తుమ్మెనాల దొంతాపూర్, జైనా,దోనూర్,నక్కలపేట, రామయ్యపల్లె తదితర గ్రామాల్లో గురువారం హెచ్ఎంల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వాడవాడలా ర్యాలీ తీశారు. విద్యార్థుల పేర్లను నమోదు చేసుకున్నారు.



చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



బతుకమ్మలతో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య



రాయికల్‌లో భారీ బతుకమ్మతో చైర్మన్, కౌన్సిలర్లు

ఊరూరా చెరువుల పండుగ

- మత్స్యకారులతో తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు
- కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు
- ఇంటింటా బోనాలు, బతుకమ్మలతో గ్రామస్తుల సందడి

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/కోరుట్లరూరల్/మల్లాపూర్/రాయికల్/మల్యాల/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి/సారంగాపూర్/పెగడపల్లి/గొల్లపల్లి/కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లోని అన్నిగ్రామాల్లో ఊరూరా చెరువుల పండుగను ప్రజాప్రతినిధులు, నాయకులు, గంగపుత్రులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు, బతుకమ్మలతో చెరువుల వద్దకు వెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మలు ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులంతా సహపంక్తి భోజనాలు చేశారు.



బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న జెడ్పీటీసీ లావణ్య



దావన్‌పల్లిలో బోనాలతో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని



మల్లాపూర్‌లో గ్రామస్తుల ప్రత్యేక పూజలు



మోరపల్లిలో బోనాలతో మహిళలు



కథలాపూర్‌లో బోనమెత్తిన లోక బాపురెడ్డి



పెగడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గొధూర్‌లో బోనమెత్తిన ఎంపీపీ జాజాల భీమేశ్వరి



చింతలపేటలో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు



పెంబట్లలో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు



రాఘవపట్నంలో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

స్వయం ఉపాధిపై మహిళలు దృష్టి సారించాలి



కుట్టుమెషీన్లు అందిస్తున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: స్వయం ఉపాధిపై మహిళలు దృష్టిసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత పేర్కొన్నారు పట్టణంలోని 18వార్డుకు చెందిన నిరుపేద మహిళలు ఫసియా, సానియాలకు గురువారం నితీశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమెషీన్లు అందించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తమ కుమారుడు నితీశ్ పేరుతో ఏర్పాటుచేసిన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికీ ఎంతోమంది నిరుపేద మహిళలకు స్వయం ఉపాధిలో భాగంగా కుట్టుమెషీన్లు అందించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీనా పాల్గొన్నారు.

కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్సీ



శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి ప్రసాదాలు అందించి శాలువతో సన్మానించారు. మహిళలుఅధిక సంఖ్యలో స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం అన్నదాన చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రాయికల్: పట్టణంలోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ప్రభుత్వం అందించిన బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పలత, సిందూరి, సుమలత, ఆయా విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వయసు నిబంధన పెంచాలి

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులపై ఆధారపడిన వారికి, వెనుకబడిన కులాలకు చెందిన కమ్మరి, వడ్రంగి, కుమ్మరి, కంచరి, అవుసుల ఇతర కులాల వారికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలపై లబ్ధిదారుల వయస్సు 65 ఏళ్లకు పెంచాలని బీజేపీ జిల్లా లీగల్‌సెల్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయనమాట్లాడుతూ.. పేద, బలహీన వర్గాలైన చేతివృత్తుల వారి వయస్సు 55 ఏళ్లకే నిర్ణయించిందని, దీనిని 65 ఏళ్లకు పెంచాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పంటలకు మద్దతు ధర పెంచిన ప్రధాని మోదీ చిత్రపటానికి భారత్ సురక్షాసమితి ఆధ్వర్యంలో గురువారం తహసీల్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. భారత్ సురక్షాసమితి సభ్యులు మాట్లాడుతూ.. అన్నదాతలకు అండగా నిలిచేందుకు వివిధ పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను లాభసాటిగా మార్చేందుకు కేంద్రప్రభుత్వ నిర్ణయం రైతులకు లాభిస్తుందన్నారు. కార్యక్రమంలో భారత్ సురక్షాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, మల్లికార్జున్, మురళి పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా | పనుల్లో నిర్లక్ష్యమెందుకో?

- ఇదీ మేడిపెల్లి- గోవిందారం డబుల్ రోడ్డు పరిస్థితి
- ఏడాదిన్నర క్రితం రూ. 20 కోట్లు మంజూరు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



మేడిపెల్లి మండలంలో కొండాపూర్ - రంగాపూర్ గ్రామాల మధ్య సింగిల్ రోడ్డు

కథలాపూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధుల చుట్టూ నాయకులు, ప్రజలు తిరుగుతుండడం సహజం. కానీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరై ఏడాదిన్నర గడిచినా పనులు ప్రారంభించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదీ మేడిపెల్లి మండల కేంద్రం నుంచి గోవిందారం వరకు వెళ్లే డబుల్ రోడ్డు పనుల పరిస్థితి.

సీఆర్ఎఫ్ నిధులు రూ. 20 కోట్లు మంజూరు

మేడిపెల్లి మండలకేంద్రం నుంచి గోవిందారం గ్రామం వరకు సుమారు 18 కిలోమీటర్ల దూరం డబుల్ రోడ్డు నిర్మాణానికి 2020–21 ఆర్థిక సంవత్సరానికి గాను సీఆర్ఎఫ్ నిధులు రూ. 20 కోట్లు ఏడాదిన్నర క్రితం మంజూరయ్యాయి. ఈ నిధులతో మేడిపెల్లి మండలకేంద్రం నుంచి కొండాపూర్, రంగాపూర్, బీమారం, దేశాయిపేట గ్రామాల మీదుగా గోవిందారం వరకు డబుల్ రోడ్డు నిర్మించాల్సిఉంది. ఈపనులకు అప్పట్లోనే టెండర్ పూర్తయి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేయించుకున్నాడు. అయినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులకు నిధులు మంజూరైతే ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయించాల్సి ఉంది. కానీ ఈ పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నా పట్టించుకోకపోవడంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి మేడిపెల్లి- గోవిందారం డబుల్ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జాప్యం తగదు



మేడిపెల్లి నుంచి గోవిందారం వరకు సింగిల్‌రోడ్డు ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డబుల్ రోడ్డు పనులకు నిధులు మంజూరైనట్లు తెలిసి ఏళ్లనాటి సమస్య తీరిందని సంతోషపడ్డాం. నిధులు వచ్చి ఏడాదిన్నరైనా పనులు ప్రారంభించకపోవడం దారుణం. అధికారులు స్పందించి డబుల్ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి.

– చెక్కపెల్లి సంజీవ్, బీమారం

నెలరోజుల్లో పనులు ప్రారంభిస్తాం



మేడిపెల్లి- గోవిందారం డబుల్ రోడ్డు పనులకు నిధులు మంజూరై టెండర్ పూర్తయింది. నెలరోజుల్లో కల్వర్టులను విస్తరించే పనులు ప్రారంభిస్తాం. తర్వాత డబుల్ రోడ్డు పనులు చేయిస్తాం. వీలైనంతా త్వరగా పనులు ప్రారంభించి పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటాం.

– మధు, ఆర్‌అండ్‌బీ ఏఈ, మేడిపెల్లి

నీరు తెచ్చి... కుంట నింపి



వేసవి ధాటికి ఎండిన కుంట

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామానికి నీటి వనరుల లభ్యత అతితక్కువ. దీనికి తోడు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌కు చివరి గ్రామం కావడంతో ఏ పంట కూడా ఈ గ్రామానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందలేదు. దీంతో గ్రామ శివారులోని వివిధ కుంటలు వేసవిలో ఎండిపోతుండటం సర్వసాధారణంగా మారింది. ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గ్రామగ్రామాన చెరువుల పండగ నిర్వహిస్తుండగా గ్రామంలోని ఏ కుంటలో, చెరువులో నీరు లేకపోవడంతో సర్పంచ్ అర్రై లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ట్యాంకర్ల ద్వారా బావుల నుంచి నీటిని తెచ్చి గ్రామశివారులోని కొత్తకుంటను నీటితో నింపారు. చెరువుల పండగ నిర్వహించడానికి గ్రామం నుంచి పెద్దఎత్తున గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మలు, డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి కట్టమైసమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులు గ్రామంలోని చెరువులు, కుంటలు నింపడానికి దీర్ఘకాలిక ప్రణాళిక చేపడితే గానీ బట్టపల్లి గ్రామంలో సాగునీటి సమస్య తీరేలా లేదు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టి సాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్యాంకర్ నీటితో కుంటను నింపుతున్న గ్రామస్తులు

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా



ఉప్పుమడుగులో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

జగిత్యాల/రాయికల్: ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాలలో నిత్య జనగణమన సృష్టికర్త గంగాధర్, అనుచరులు, రాయికల్ మండలంలోని ఉప్పుమడుగుకు చెందిన సుమారు 30 మంది యువకులు కాంగ్రెస్ వీడి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జగిత్యాలను జిల్లా చేసి ఎంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని, నూతన కలెక్టరేట్ ఏర్పాటుతో 57 శాఖలు ఒకే చోటుకు చేరి ప్రజలకు పరిపాలన సౌలభ్యం కలిగిందన్నారు. పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అనంతరం పోచమ్మతల్లి బోనాల కార్యక్రమంలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కప్పల శ్రీకాంత్, బొడ్ల జగదీశ్, రాజ్‌కుమార్, పిట్ట ధర్మరాజు, చాంద్‌పాషా, ఆరీఫ్, సర్పంచ్ ముత్తయ్య, సింగిల్‌విండో చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు సురేందర్‌నాయక్, తిరుపతిరావు, సుధాకర్, ముఖీద్ పాల్గొన్నారు.

నవదుర్గ అమ్మవారి శోభాయాత్ర

జగిత్యాలటౌన్: నవదుర్గ అమ్మవారి పీఠం స్థాపన శోభాయాత్రలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. గోవిందుపల్లిలో నిర్మిస్తున్న నవదుర్గ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షలు ప్రోసీడింగ్ కాపీని సేవాసమితి సభ్యులకు అందించారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయం నుంచి గురువారం ఉదయం మొదలైన దుర్గమాత అమ్మవారి పీఠం స్థాపన శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నవదుర్గ సేవాసమితి సభ్యులు, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, అమ్మవారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చేపల విక్రయాల జోరు



కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో గురువారం మృగశిర కార్తె సందర్భంగా చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మృగశిర కార్తె రోజు చేపమందు వేసుకుంటే మంచిదని చేపలు తింటే ఆరోగ్యంగా ఉంటారనే నమ్మకంతో ప్రజలు చేపలు కొనేందుకు బారులు తీరారు. కిలోకు రూ. 200 నుంచి రూ.250 చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు.

చేపమందు పంపిణీ



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీధన్వంతరి ఆలయంలో మృగశిరకార్తె సందర్భంగా గురువారం చేపమందు పంపిణీ చేశారు. మూలికలు, ఆకుపసర్ల మిలితాలతో బట్టిపెట్టి తయారు చేసిన ఔషధాన్ని ఉబ్బస రోగులకు పంపిణీ చేసినట్లు ధన్వంతరి ఆలయకమిటీ సభ్యులు, ఆయుర్వేద వైద్యుడు డా.రాజన్న తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్తెపు శంకర్, గట్టు రాజేందర్, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.